APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శుక్రవారం 26, జూన్ 2026 సంపుటి: 01 సంచిక :31 పేజీలు : 04 వెల: 2-00/-

## రాష్ట్రపతిని కలిసిన సైనిక ఇంజినీరింగ్ శిక్షణార్థులు

- దేశ రక్షణలో ఇంజినీరింగ్ అధికారుల పాత్ర కీలకమని రాష్ట్రపతి
- సుస్థిర, హరిత భారత నిర్మాణానికి కృషి చేయాలని పిలుపు
- రాష్ట్రపతి భవన్‌లో శిక్షణార్థులతో భేటీ

న్యూఢిల్లీ, జూన్ 25: సైనిక ఇంజినీరింగ్ సేవలకు చెందిన శిక్షణార్థి అధికారులు గురువారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది



2వ పేజీలో



2 లో

## రాజుపేట పాఠశాలలో నూతన సైన్స్ ల్యాబ్ ప్రారంభం

- విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాల కల్పన
- ప్రారంభించిన మంత్రి సీతక్క, కలెక్టర్ హేమంత్ సహదేవరావు
- విజ్ఞాన విద్యకు మరింత ప్రోత్సాహం

ములుగు, జూన్ 25: ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనం, సైన్స్ ల్యాబ్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు.

## బ్రిక్స్ ఇంధన మంత్రుల సమావేశానికి భారత్ ఆతిథ్యం

- గురుగ్రామ్‌లో 11వ బ్రిక్స్ ఇంధన మంత్రుల సమావేశం
- ఇంధన భద్రత, సహకారంపై సభ్య దేశాల ఏకాభిప్రాయం
- సంయుక్త ప్రకటన విడుదలతో సమావేశం ముగింపు

గురుగ్రామ్, జూన్ 25 : బ్రిక్స్ అధ్యక్ష దేశంగా భారత్ ఆధ్వర్యంలో 11వ బ్రిక్స్ ఇంధన మంత్రుల సమావేశం గురుగ్రామ్‌లో నిర్వహించారు. బ్రిక్స్ సభ్య దేశాల ఇంధన మంత్రులు పాల్గొన్న ఈ సమావేశంలో ఇంధన భద్రత, సుస్థిర అభివృద్ధి,




2 లో

## సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు



2 లో

- మాధవరం గ్రామంలో ఏర్పాట్ల పరిశీలన
- క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కర్నూలు, నంద్యాల ఎస్పీలు
- భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు

కర్నూలు, జూన్ 25 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో భద్రతా ఏర్పాట్లను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటన సజావుగా జరిగేలా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. పర్యటన మార్గాలు, సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది తమకు

## మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కలయిక చరిత్రలో నిలిచిపోతుంది

అనంతపురం, జూన్ 25 అనంత సూర్య : మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ.. మూడు రాష్ట్రాల రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు నాంది పలికిందని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కర్ణాటక రాష్ట్రం హోసపేటలో జరిగిన తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వాగతం పలికారు. తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్తగా అమర్చిన గేట్ల ప్రారంభం చారిత్రాత్మక ఘట్టమని, ఇది ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల రైతులకు మరియు ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి ఆర్ పాటిల్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్యాం గేట్ల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఇంజనీర్ కన్నయ్య నాయుడు గారిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభినందించారు. రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం తుంగభద్ర జలాశయం మరియు కొత్తగా ఏర్పాటు చేసిన డ్యాం గేట్లను సహచర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో సాగునీటి అవసరాలకు మరింత బలాన్నిస్తుందని, రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలు అందిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం తుంగభద్ర ప్రాజెక్టు ఆధునీకరణలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.





## ఎన్డీయే ప్రభుత్వాల ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్తాం: సత్యకుమార్ యాదవ్

- ధర్మవరంలో ప్రగతి నివేదిక సభ
- రెండేళ్లలో 90 శాతం హామీలు అమలు చేశామని వెల్లడి
- రూ.1,692 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ప్రకటన

ధర్మవరం, జూన్ 25 : కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల ప్రగతి, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై ధర్మవరంలో నిర్వహించిన ప్రగతి నివేదిక సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డితో కలిసి సభలో ప్రసంగించారు. ప్రజలు తమపై ఉంచిన

2వ పేజీలో





2 లో

## విశాఖ పోర్టుకు చేరిన కార్డేలియా క్రూయిజ్

- క్రూయిజ్ పర్యాటక రంగానికి మరింత ఊతం
- పర్యాటకం, ఆతిథ్య రంగాలకు ప్రోత్సాహం
- తూర్పు తీరంలో విశాఖకు ప్రత్యేక గుర్తింపు

విశాఖపట్నం, జూన్ 25: ప్రముఖ పర్యాటక నౌక కార్డేలియా క్రూయిజ్ విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. ఈ నౌక రాకతో నగరంలో క్రూయిజ్ పర్యాటక రంగానికి మరింత

## ధర్మవరానికి తాగునీటి ప్రాజెక్టుకు శ్రీకారం

- రూ.36.21 కోట్లతో అభివృద్ధి పనులకు భూమిపూజ
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల నీటి సరఫరా లక్ష్యం

ధర్మవరం, జూన్ 25: ధర్మవరం పట్టణంలో తాగునీటి సరఫరా




## స్థానికత హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం: కవిత

- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పునర్విమర్శ పిటిషన్ వేయాలని డిమాండ్
- గ్రూప్-1 నియామకాలలో తెలంగాణ యువతకు అన్యాయం జరిగిందని ఆరోపణ
- సోమాజిగూడలో తెలంగాణ స్థానికతపై రౌండ్ టేబుల్ సమావేశం

2 లో

హైదరాబాద్, జూన్ 25: స్థానికత హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ ప్రజలు శతాబ్దాలుగా పోరాటం చేస్తున్నారని, ఈ అంశంలో ఎలాంటి రాజీకి తావులేదని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలంగాణ స్థానికత -



## ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి

- ఓటర్ల వివరాల పరిశీలన వేగవంతం చేయాలని పిలుపు
- ప్రతి ఓటు విలువైనదేనని పార్టీ శ్రేణులకు సూచన
- బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యాచరణ



2వ పేజీలో

# విశాఖ పోర్టుకు చేరిన కార్డేలియా క్రూయిజ్

(మొదటి పేజీ తర్వాత)

ప్రోత్సాహం లభించనుంది. పర్యాటకుల రాకపోకలు పెరగడంతో స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.క్రూయిజ్ పర్యాటకం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విశాఖపట్నం దేశంలోని ప్రముఖ సముద్ర పర్యాటక కేంద్రంగా ఎదుగుతోంది. ఆధునిక వసతులు, సహజసిద్ధమైన తీరప్రాంత సౌందర్యం, మెరుగైన పోర్టు సదుపాయాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.కార్డేలియా క్రూయిజ్ రాకతో పర్యాటక రంగంతో పాటు ఆతిథ్య రంగం, రవాణా, స్థానిక వ్యాపారాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది. నగరానికి వచ్చే సందర్శకుల సంఖ్య పెరగడం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. విశాఖపట్నం పోర్టు ఇప్పటికే తూర్పు తీరంలో కీలక సముద్ర కేంద్రంగా గుర్తింపు పొందింది. క్రూయిజ్ నౌకల రాకతో పర్యాటక రంగంలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది.అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశాలు పెరుగుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక శాఖ క్రూయిజ్ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి. పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కొత్త పర్యాటక మార్గాలను అభివృద్ధి చేస్తున్నాయి. కార్డేలియా క్రూయిజ్ రాకతో విశాఖపట్నం పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించిందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్రూయిజ్ నౌకలను ఆకర్షించడం ద్వారా నగరాన్ని దేశంలోని ప్రధాన క్రూయిజ్ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.

# ధర్మవరానికి తాగునీటి ప్రాజెక్టుకు శ్రీకారం

(మొదటి పేజీ తర్వాత)

వ్యవస్థను మెరుగుపరిచేందుకు చేపట్టిన అభివృద్ధి పనులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ భూమిపూజ చేశారు. అమృత్ 2.0 పథకం కింద రూ.36.21 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు అందించనున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా వ్యవస్థను ఆధునికీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ధర్మవరం మున్సిపాలిటీని మూడు జోన్లుగా విభజించి సమగ్ర తాగునీటి పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నారు. ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల తాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. నీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు.అమృత్ 2.0 పథకం కింద చేపట్టే పనులు పూర్తయితే పట్టణంలోని అనేక కాలనీలకు మెరుగైన నీటి సరఫరా అందుబాటులోకి రానుంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ, పంపిణీ వ్యవస్థలను కూడా బలోపేతం చేయనున్నారు. దీనివల్ల నీటి కొరత సమస్య గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి రంగాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పట్టణాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. తాగునీటి ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ధర్మవరం ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

(మొదటి పేజీ తర్వాత)

అనుమానాస్పద పరిస్థితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. పర్యటన ప్రాంగణంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాట్లను కూడా పరిశీలించారు. పోలీసు సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యటన సమయంలో శాంతిభద్రతలు కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఎస్పీలు ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# పాక్ గగనతలంలోకి ప్రవేశించిన ఎయిర్ ఇండియా విమానం

(మొదటి పేజీ తర్వాత)

ఈ ఘటనపై ఎయిర్ ఇండియా దర్యాప్తు ప్రారంభించింది.సమాచారం ప్రకారం, రాత్రి 9.18 గంటలకు ఢిల్లీ నుంచి టేకాఫ్ అయిన ఆ విమానం 10.30 గంటలకు అమృత్‌సర్ చేరుకోవాల్సి ఉండగా, మార్గమధ్యంలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో విమానం కొద్ది సెకన్ల పాటు పాకిస్థాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించింది.వెంటనే పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ అధికారులు పైలట్‌కు హెచ్చరిక సందేశాలు పంపినట్లు సమాచారం. పరిస్థితిని గమనించిన పైలట్ వెంటనే చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అమృత్‌సర్ విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సాంకేతిక లోపం కారణంగా విమానం తిరిగి ఢిల్లీకి మళ్లించబడింది. అనంతరం రెండు గంటల తర్వాత మళ్లీ టేకాఫ్ తీసుకుని రాత్రి 2.20 గంటలకు అమృత్‌సర్‌లో సురక్షితంగా ల్యాండ్ అయింది.విమానాశ్రయ డైరెక్టర్ భూపేందర్ సింగ్ తెలిపిన ప్రకారం, విమానం పాకిస్థాన్ గగనతలంలో చాలా స్వల్ప దూరం మాత్రమే ప్రయాణించిందని, పెద్ద స్థాయిలో ఎలాంటి ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు.ఈ ఘటన రెండు దేశాల మధ్య గగనతల భద్రతా అంశంపై మళ్లీ చర్చకు దారితీసింది.

# ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తర్వాత)

టెక్కలి, జూన్ 25 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఓటరు జాబితా పారదర్శకతే ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. నిమ్మాడలోని శిబిర కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన యూనిట్, సమూహం, బూత్ బాధ్యులు, ఓటరు జాబితా ప్రతినిధులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల వివరాల పరిశీలన ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుత ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ఓటర్ల గుర్తింపు, వివరాల సరిపోల్చడం, అర్హులైన ప్రతి ఒక్కరిని జాబితాలో చేర్చడం వంటి అంశాల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని పార్టీ శ్రేణులకు చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఓటు ప్రజాస్వామ్యంలో కీలకమని పేర్కొన్న మంత్రి, సంబంధిత బాధ్యులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 86 శాతం ఓటర్ల వివరాల పరిశీలన పూర్తికావడం సంతోషకరమని అభినందించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ప్రభుత్వం నెరవేర్చిన హామీలు, చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకం కావాలని పార్టీ నాయకులకు చెప్పారు.ప్రతి బుధవారం బూత్ స్థాయి సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# స్థానికత హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం: కవిత

(మొదటి పేజీతర్వాత)

సవాళ్లు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్థానికత అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పునర్విమర్శ పిటిషన్ దాఖలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరుద్యోగులు, ఉద్యమకారులతో కలిసి తామే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల అసలు స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.తెలంగాణలో ఉద్యోగాల విషయంలో చారిత్రకంగా స్థానికులు అన్యాయం ఎదుర్కొన్నారని కవిత పేర్కొన్నారు. బహుమనీ కాలం నుంచి ముల్కీ నిబంధనలు, ఆరు సూత్రాల పథకం, 610 జీవో వరకు జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ స్థానిక హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రూప్-1 నియామకాలలో తెలంగాణ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికులకు రావాల్సిన అవకాశాలు ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు దక్కేలా వ్యవహరించారని విమర్శించారు. తెలంగాణ యువతకు చెందాల్సిన ఉద్యోగాలు స్థానికేతరులకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్-1 నియామకాలపై సమగ్ర సమీక్ష చేపడతామని కవిత తెలిపారు. అవసరమైతే న్యాయపరమైన సమీక్ష కమిటీ ఏర్పాటు చేసి నియామకాల ప్రక్రియను పరిశీలిస్తామని చెప్పారు. తెలంగాణ యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో రాజీ పడబోమని స్పష్టం చేశారు.నీటి వాటాలు, ఉద్యోగాలు, పెట్టుబడులు, స్థానిక హక్కుల అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగుతుందని, జూలై 2న ఉప్పల్‌లో నిర్వహించనున్న కార్యక్రమం ద్వారా స్థానికత అంశాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. నిరుద్యోగులు, ఉద్యమకారులు, తెలంగాణ ప్రజల పక్షాన టీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రాష్ట్రపతిని కలిసిన సైనిక ఇంజినీరింగ్ శిక్షణార్థులు

(మొదటి పేజీ తర్వాత)

ముర్మును కలిశారు. ఈ సందర్భంగా దేశ రక్షణ వ్యవస్థలో ఇంజినీరింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్రపతి పేర్కొన్నారు. వారి నైపుణ్యం, అంకితభావం, కృషి దేశ భద్రతకు బలమైన పునాదిగా నిలుస్తాయని అన్నారు. సైన్యంలో సేవలందిస్తున్న సైనికులు, నావికులు, వైమానిక దళ సిబ్బంది తమ విధులను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఇంజినీరింగ్ అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమని రాష్ట్రపతి వివరించారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడంలో వారి సేవలు విశేషంగా దోహదపడతాయని చెప్పారు.సైనిక ఇంజినీరింగ్ అధికారులు కేవలం నిర్మాణ పనులకే పరిమితం కాకుండా దేశ భద్రతా అవసరాలకు అనుగుణంగా అత్యున్నత ప్రమాణాలతో సేవలందించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలను వినియోగిస్తూ సమర్థవంతమైన వ్యవస్థలను రూపొందించాలని కోరారు. దేశ రక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్రపతి సూచించారు. వారి కృషి బలమైన, సురక్షితమైన భారతదేశ నిర్మాణానికే కాకుండా పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, సుస్థిర భారత నిర్మాణానికి కూడా తోడ్పడాలని ఆకాంక్షించారు.వేగంగా మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఇంజినీరింగ్ రంగంలో నూతన సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని శిక్షణార్థులకు సూచించారు. సేవాభావం, క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వహించాలని చెప్పారు. రాష్ట్రపతితో జరిగిన ఈ భేటీ శిక్షణార్థి అధికారులకు ప్రేరణనిచ్చిందని అధికారులు తెలిపారు. దేశ రక్షణ, అభివృద్ధి లక్ష్యాల సాధనలో తమ వంతు పాత్రను సమర్థంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని వారు పేర్కొన్నారు.ు..

# బ్రిక్స్ ఇంధన మంత్రుల సమావేశానికి భారత్ ఆతిథ్యం

(మొదటి పేజీ తర్వాత)

పరస్పర సహకారం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో సభ్య దేశాలు తమ తమ జాతీయ పరిస్థితులు, అభివృద్ధి ప్రాధాన్యతలు, ఇంధన విధానాలను గౌరవించడం అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించాయి. ప్రతి దేశం తన అవసరాలకు అనుగుణంగా ఇంధన రంగ అభివృద్ధి వ్యూహాలను అమలు చేసుకునే హక్కును గుర్తించాయి.ప్రపంచ ఇంధన అవసరాలు, ఇంధన మార్పిడి ప్రక్రియ, పరిశుభ్రమైన ఇంధన వనరుల వినియోగం, ఇంధన ప్రాప్యత పెంపు వంటి అంశాలపై కూడా సభ్య దేశాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. పరస్పర సహకారంతో ఇంధన రంగంలో సవాళ్లను ఎదుర్కోవాలని నిర్ణయించాయి. బ్రిక్స్ దేశాల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడి, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. అభివృద్ధి చెందుతున్న దేశాల ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమతుల్య విధానాలు అవలంబించాలని సూచించారు.సమావేశం ముగింపు సందర్భంగా 11వ బ్రిక్స్ ఇంధన మంత్రుల సంయుక్త ప్రకటనను ఆమోదించారు. ఇందులో సభ్య దేశాల ఉమ్మడి దృక్పథం, భవిష్యత్ కార్యాచరణ, ఇంధన రంగ సహకారంపై ఏకాభిప్రాయాన్ని ప్రతిబింబించారు. ఈ సమావేశం ద్వారా ఇంధన రంగంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కానుందని అధికారులు పేర్కొన్నారు. ప్రపంచ ఇంధన రంగంలో స్థిరత్వం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఈ సమావేశం కీలకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# ఎన్డీయే ప్రభుత్వాల ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్తాం: సత్యకుమార్ యాదవ్

(మొదటి పేజీ తర్వాత)

నిలబెట్టుకుంటూ రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు పురోగతిని ప్రజల ముందుంచడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.
ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో దాదాపు 90 శాతం ఇప్పటికే అమలు చేశామని సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మిగిలిన హామీలను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజల వద్దకు వెళ్లి చేసిన పనులను వివరించడం ఎన్డీయే ప్రభుత్వాల రాజకీయ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో రూ.1,692 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద రూ.36.21 కోట్లతో తాగునీటి సరఫరా అభివృద్ధి పనులు, ఆయుర్వేద వైద్య కళాశాల ఏర్పాటు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, విద్యుత్ మౌలిక వసతుల విస్తరణ వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. హెచ్ఎన్ఎస్ఎస్--హెచ్ఎల్సీ అనుసంధానం ద్వారా సాగునీటి సదుపాయాల మెరుగుదల, వైద్య సేవల విస్తరణతో పాటు పలు రంగాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ఫలితాలు ప్రజలకు ప్రత్యక్షంగా అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూటమి కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని మంత్రి పిలుపునిచ్చారు. ధర్మవరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# రాజుపేట పాఠశాలలో నూతన సైన్స్ ల్యాబ్ ప్రారంభం

(మొదటి పేజీ తర్వాత)

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఈ విద్యా సదుపాయాలను విద్యార్థులకు అంకితం చేశారు. పాఠశాల అభివృద్ధిలో భాగంగా నిర్మించిన నూతన భవనం, సైన్స్ ల్యాబ్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా విజ్ఞాన శాస్త్ర విద్యను ప్రయోగాత్మకంగా అభ్యసించే అవకాశాలు మరింత మెరుగుపడనున్నాయి.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పట్టణ ప్రాంతాల విద్యార్థులతో సమానమైన విద్యా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఆధునిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో సైన్స్ ల్యాబ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన బోధనకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి అవసరమైన అన్ని వనరులు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రండి... పోలియో వ్యాధిని తరిమికొడదాం

**జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమం - డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి. దేవి పిలుపు**




అనంతపురం, జూన్ 25 అనంత సూర్య: జిల్లాలో ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ.బి. దేవి ప్రజలకు పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.జిల్లాలో 0-5 సంవత్సరాల మధ్య వయస్సు గల 2,83,430 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 1,623 బూత్‌లు, 5,247 మంది సిబ్బంది, 58 ప్రత్యేక బృందాలు, 68 మొబైల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో కూడా పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు.మొదటి రోజు మిగిలిన చిన్నారులను గుర్తించి జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సందర్శన ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ సహకరించి ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో బూత్‌లకు తీసుకురావాలని డాక్టర్ ఈ.బి. దేవి విజ్ఞప్తి చేశారు..

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ

పుట్టపర్తి, జూన్ 25 అనంత సూర్య: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే





పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనే-యులు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, సంక్షేమ పథకాలు కల్పించాలని కోరారు. డైలీ వేజ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి, దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా చేయాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కరించకపోతే జూలై 7న చేపట్టనున్న "చలో విజయవాడ" కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. అనంతరం డీఆర్వో కొండయ్యకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సూరి, ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్‌రాజు, కోశాధికారి నాగరాజు, నాయకులు వినోద్, నరసింహమూర్తి, బావక్క, గంగాధరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టి.డి. కృష్ణ సుమన్ రెడ్డి జన్మదిన వేడుకలు

నల్లమాడ, జూన్ 25 అనంత సూర్య: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టి.డి. కృష్ణ సుమన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు గురువారం నల్లమాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనంతరం అభిమానులు, నాయకులు కృష్ణ సుమన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన కృష్ణ సుమన్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని పలువురు కొనియాడారు.ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ, ఆయన సేవా దృక్పథం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆశీస్సులతో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రఫీ, ప్రకాష్, నందకిషోర్, గణేష్, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు...

# అక్రమ ఖనిజ తవ్వకాలు, రవాణాపై ఉక్కుపాదం

**భారీ జరిమానాలు, వాహనాల సీజ్: గనుల శాఖ హెచ్చరిక**

పుట్టపర్తి, జూన్ 25 అనంత సూర్య: జిల్లా వ్యాప్తంగా ఇసుక, మట్టి తదితర ఖనిజాల అక్రమ తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు గనుల శాఖ ఏడీ అమీర్ బాషా తెలిపారు. రెవెన్యూ, మైనింగ్, పంచాయతీరాజ్ శాఖలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ మైనింగ్‌ను అరికట్టనున్నట్లు చెప్పారు.ప్రభుత్వం జారీ చేసిన సవరించిన నిబంధనల ప్రకారం ఇసుక, మట్టి వంటి ఖనిజాలను అక్రమంగా తవ్వినా, రవాణా చేసినా రూ.1 లక్ష వరకు జరిమానా విధించడంతో పాటు సంబంధిత వాహనాలను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు.అలాగే ఎంఎండీఆర్ చట్టం--1957 ప్రకారం అక్రమ మైనింగ్‌కు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టులో ప్రాసిక్యూషన్ చేపడతామని తెలిపారు. అక్రమ కార్యకలాపాల్లో ఉపయోగించిన జేసీబీలు, పొక్లైన్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలను స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇసుక, మట్టి, గ్రానైట్ వంటి సహజ వనరులను అక్రమంగా తవ్వి తరలించే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించబోమని అమీర్ బాషా స్పష్టం చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడితే భారీ జరిమానాలతో పాటు వాహనాల స్వాధీనం, జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# ప్రశాంతంగా కొనసాగుతోన్న గూగూడు కుళ్ళాయిస్వామి బ్రహ్మోత్సవాలు- డ్రోన్లతో పటిష్ట నిఘా



అనంతపురం క్రైమ్, జూన్ 25 అనంత సూర్య : నార్పల మండలం గూగూడు కుళ్ళాయిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు.. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. క్షేత్ర పరిధిలో భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశా-రు.

డ్రోన్ కెమెరాల నిఘా - కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు.

డ్రోన్ల వినియోగం :

ఉత్సవ ప్రాంగణాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు, గ్రామ పరిసరాలు, ప్రధాన రహదారులపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచారు.

సిసిటివి కెమెరాలు :

క్షేత్రంలోని ప్రతి కదలికను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి సిబ్బంది 24/7 నిశితంగా పరిశీలిస్తున్నారు.

భక్తులకు పోలీసుల సూచనలు, రద్దీ నియంత్రణ :

భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూ లైన్లను క్రమబద్ధీకరిస్తూ, ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక పార్కింగ్ జోన్లను ఏర్పాటు చేశారు. ఉత్సవాల వేళ భక్తులు తమ విలువైన నగలు, పర్సులు, మొబైల్ ఫోన్ల పట్ల అప్రమ-త్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస-్తువులు కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించి, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పుట్టపర్తిలో నాబార్డ్ జిల్లా నూతన కార్యాలయం ప్రారంభం

- **గ్రామీణాభివృద్ధికి నూతన కార్యాలయం కీలక కేంద్రం**
- **వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఏపీ ప్రాంతీయ కార్యాలయ సీజీఎం సోమైందర్ సింగ్**

పుట్టపర్తి/కొత్తచెరువు, జూన్ 25, అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో నాబార్డ్ నూతన రెసిడెంట్-కమ్-ఆఫీస్ గురువారం (జూన్ 25న) ఘనంగా ప్రారంభమైంది. ఎనుములవారిపల్లిలోని సాయి సందీప్ టవర్స్, సత్య బ్లాక్ (ఫ్లాట్ నంబర్ 401)లో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయ ప్రధాన మహాప్రబంధకులు (సీజీఎం) సోమైందర్ సింగ్ హైదరాబాద్/విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీజీఎం సోమైందర్ సింగ్ మాట్లాడుతూ.. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రంగాలలో పనిచేస్తున్న అన్ని భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. జిల్లాలో నాబార్డ్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరించాలని సూచించారు. ప్రసిద్ధ ధర్మవరం చీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మల కళకు భౌగోళిక సూచిక నమోదు, పోస్ట్-జిఐ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాబార్డ్ పరిధిలోకి రాని గ్రామపంచాయతీలలో కొత్త ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని, రుణ సదుపాయాలను సమ-ర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకట ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ.. ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన రుణ ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు. నాబార్డ్ డీడీఎం, ఎల్డీఎం సమన్వయంతో పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఎఫ్‌పీఓల వ్యాపార అవసరాల కోసం బ్యాంకు రుణాల లభ్యతలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారత కోసం నాబార్డ్, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఎం ఈ డి పి, ఎల్ ఈ డి పి కార్యక్రమాల ద్వారా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనలు, విక్రయాలకు నాబార్డ్ కల్పిస్తున్న మద్దతును అభినందించారు. అనంతరం ఆర్ సెట్ డైరెక్టర్ శాంతి ప్రియ మాట్లాడుతూ.. గ్రామీణ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో, మౌలిక వసతుల కల్పనలో నాబార్డ్



అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ సాయికిరణ్ సమావేశ ఎజెండాను వివరించి, అతిథులను పరిచయం చేశారు. ప్రభుత్వ శాఖలు, ఎల్డీఎం, ఆర్‌సెట్, స్వచ్ఛంద సంస్థలు, ఎఫ్‌పీఓలు, బ్యాంకర్లతో కలిసి జిల్లాలో నాబార్డ్ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో నాబార్డ్ కార్యకలాపాల విస్తరణకు, గ్రామీణాభివృద్ధికి ఈ నూతన కార్యాలయం కీలక కేంద్రంగా పనిచేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అధికారులు, ఎఫ్‌పీఓల సీఈఓలు, క్లస్టర్ ఆధారిత వ్యాపార సంస్థలు, వాటర్‌షెడ్ ప్రాజెక్టుల ప్రతినిధులు, నాబార్డ్ ఏపీ ప్రాంతీయ కార్యాలయ సీనియర్ అధికారులు, సీపీడీ బృంద సభ్యులు వర-్చువల్ విధానంలో పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండే చుక్కలు









## పుట్టపర్తిలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ, మానవహారం

పుట్టపర్తి, జూన్ 25 అనంత సూర్య: ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజ్ బేగం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం గణేష్ కూడలిలో మానవహ-ారం ఏర్పాటు చేసి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఫైరోజ్ బేగం మాట్లాడుతూ, ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లాలోని 32 మండలాల్లో పోలియో కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేశామని, బస్టాండ్లు సహా ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పోలియో నిర్మూలన లక్ష్య సాధన కోసం ఇప్పటికే విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, తొలి విడతలో మిగిలిపోయిన పిల్లలను గుర్తించి ఇంటింటి సందర్శన ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల సహకారంతో జిల్లాలో వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# మోదీ - చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి









## కూటమి విజయోత్సవ సభలో మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూన్ 25 అనంత సూర్య: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మరియు టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలన, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తైన సందర్భంగా ధర్మవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డితో పాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాలు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనను విమర్శిస్తూ, ప్రజలు ఆ పార్టీని 151 స్థానాల నుంచి 11 స్థానాలకు పరిమితం చేశారని అన్నారు. ఆరోగ్యశ్రీ, సూపర్ సిక్స్ హామీల అమలుపై వస్తున్న విమర్శలను ఖండిస్తూ, రెండేళ్లలోనే 7 వేల కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీపై ఖర్చు చేసి 29 లక్షల మందికి సేవలు అందించామని వివరించారు. ధర్మవరం నియోజకవర్గంలో రూ.1600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో ధర్మవరంలో మొదట స్వాగతం పలికింది పరిటాల శ్రీరామ్ అని, ఆ తర్వాత చిలకం మధు-సూదన్ రెడ్డి సహకారం కూడా లభించిందని గుర్తు



చేశారు.పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ధర్మవరానికి రూ.30 కోట్లతో చేనేత మెగా క్లస్టర్ తీసుకువచ్చామని, రైతుల కోసం సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పీఏబీఆర్ కుడికాలువను హంద్రీనీవా ప్రధాన కాలువతో అనుసంధానం చేసే ప్రణాళిక అమల్లోకి వస్తే సాగునీటి సమస్య శాశ-్వతంగా పరిష్కారమవుతుందన్నారు. మరో 15 ఏళ్ల పాటు కూటమి అధికారంలో ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైసీపీ ఓర్వలేక కుల రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ఖండిస్తూ, రాష్ట్రంలో ప్రస్తుతం శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని అన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది కూటమి ప్రభుత్వమేనని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# మొదటి అడుగులోనే.. పక్కా మోసం!













*సీనియర్ విలేకరి చెరుకూరి రామాంజనేయులు / అనంత సూర్య, జూన్ 25 :*

**మోసం..** పక్కా మోసం.. విద్యాశాఖ నుండి పాఠశాలల నిర్వహణకు అనుమతి ఒకలా తెచ్చుకుని.. నిర్వహణ మాత్రం మరోలా.. అది కూడా విద్యా నిబంధనలు ఉల్లంఘిస్తూ 'లేనిది ఉన్నట్లుగా' ధనార్జనే పరమావధిగా మొదటి అడుగులోనే మోసం చేస్తున్నాయి అనంతపురం జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు. అటు పాఠశాల పేరు విషయంలో కానీ, ఫీజులు వసూళ్లు, హాస్టల్ నిర్వహణ విషయంలో కానీ 'అంతా మా ఇష్టం' అన్నట్లుగా ఓ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషనే తమ అక్రమాలకు 'శ్రీరామరక్ష' అన్నట్లుగా దోబూచి కాసుల దొంగాటతో బాహాటంగానే పాఠశాల ప్రాంగణంలోనే విద్యాసామాగ్రిని విక్రయిస్తూ విద్యను పక్కా వ్యాపారంగా మార్చేస్తున్నారు. విద్యా హక్కు చట్టానికి సంబంధించిన 25శాతం రిజర్వేషన్లు కూడా నిజమైన పేదలకు అందకుండా కొందరితో డీల్ కుదుర్చుకుని డమాల్ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఇంతటి మోసాలకు అభం శుభం తెలియని రాష్ట్ర మంత్రి, చిన్నబాబు నారా లోకేష్ పేరును కూడా విరివిగా పలువురు వద్ద వాడేస్తున్నారని తెలుస్తోంది.

- అనుమతులు ఒకలా.. నిర్వహణ మరోలా..
- విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులను నేటికీ నయవంచన
- విద్యా నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూళ్లు, హాస్టల్ నిర్వహణ
- ఆ కోవలోనివే హైదరాబాద్, రఘు, కేశవరెడ్డి లాంటి తదితర పాఠశాలలెన్నో!
- అన్నీ తెలిసినా.. జిల్లా విద్యాశాఖ, జిల్లా కలెక్టర్ మౌనం వెనుక అనుమానాలు
- నాణ్యమైన విద్య పేరుతో బాహాటపు వ్యాపారాలు
- విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత విద్య అమలు కాలేదన్నది ఆరోపణ
- జిల్లాలో పలువురి వద్ద మంత్రి నారా లోకేష్ పేరును మరోలా వాడేస్తున్న దౌర్భాగ్యం

### అనంత అర్బన్‌లో మరొకటి 'కేశవరెడ్డి' :

అనంత నగరంలోని సాయి నగర్‌లో ఉన్న కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటైన కేశవరెడ్డి పాఠశాల కూడా విద్యా హక్కు చట్టం నిబంధనలు ధిక్కరించి పాఠశాల ప్రాంగణంలోనే అధిక ధరలు నిర్ణయించి మరీ విద్యాసామాగ్రిని విక్రయాలు చేస్తోంది. ఫీజుల వసూళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చెబుతున్న ఫీజులకు.. వసూళ్లు చేస్తున్న ఫీజులకు పొంతనే లేదని సమాచారం. ఈ పాఠశాలకు సంబంధించిన మరిన్ని లోపాలను, లోపాయికారి ఒప్పందాలను **మరో కథనంలో** వివరింపజేస్తాం.




### హైదరాబాద్ పేరుతో హైలెవెల్‌లో మోసం :



విద్యా వ్యవస్థలో మోసం చేయడంలో ఇది అదే బాపతే. ప్రభుత్వం నుండి ఒకలా అనుమతి తెచ్చుకొని మరోలా లేని పేరును కలుపుకొని విద్యను వ్యాపారంగా మార్చుకుందుట హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్. ఈ పాఠశాల కూడా ఆదిలోనే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పేరుతో సోషల్ మీడియా అంతటా చలామణి అయ్యి, లోలూరు ప్రాంతంలోని ఎందరో రైతులను మోసం చేసిందని తెలిసింది. విద్యా నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఫీజులు వసూలు చేస్తూ హాస్టల్ కూడా నిర్వహిస్తుందట. ఇక్కడ ఫీజులు 50 వేల నుండి రూ.లక్షకు పైమాటే అని తెలిసింది. ఈ పాఠశాల యాజమాన్యం అన్నదాతలను ఏవిధంగా మోసం చేస్తారంటే.. తీయనైన మాటలతో అలా తమ వైపుకు తిప్పుకొని పాఠశాలలో చేర్పించుకుంటారట. పాఠశాలలోకి చేరిన వెంటనే.. అందుకోసం, ఇందుకోసం, వాటికోసం, దీనికోసం అంటూ పలు రకాలుగా వసూళ్ల పర్వం కొనసాగిస్తూనే.. పాఠశాల ప్రాంగణంలోని విద్యాసామాగ్రిని అమ్ముతున్నారని విశ్వసనీయ సమాచారం. ఇదే విషయంపై విద్యాధికారులను పలువురు మీడియా సోదరులు, విద్యార్థి సంఘాలు వివరణ కోరగా.. వారికి కూడా నోటీసులు పంపామని, వారికి ప్రభుత్వం నుండి ఇచ్చిన అనుమతి మేరకే విద్యా నిబంధనలు పాటించి హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పేరుతో కొనసాగించుకోవాల్సిందని తెలియజేశారు. మరోమారు ఈ పాఠశాలపై ప్రత్యేకమైన ఫిర్యాదులు అందితే మాత్రం ఈసారి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




### సైనిక్ పేరుతో రఘు నయవంచన..



PRICE LIST

| S.NO | CLASS | START | SMART |
| --- | --- | --- | --- |
| 1 | NURSERY | 3150 | కేశవ రెడ్డి స్కూల్ బుక్స్ అమ్మకాల వివరాలు |
| 2 | LKG | 3750 | |
| 3 | UKG | 4650 | |
| 4 | 1st class | 6650 | |
| 5 | 2nd class | 6650 | |
| 6 | 3rd class | 7850 | |
| 7 | 4th class | 8250 | |
| 8 | 5th class | 8250 | |
| 9 | 6th class | 5800 | 7800 |
| 10 | 7th class | 6200 | 8200 |
| 11 | 8th class | 7100 | 9100 |
| 12 | 9th class | 7300 | 9300 |

ఆ పాఠశాల యాజమాన్యం చేసుకుంటున్న ప్రచారానికి.. పాఠశాలలో వస్తున్న ర్యాంకులకు పొంతనే లేదట. ప్రభుత్వ అనుమతులు లేకుండా.. సైనిక్ స్కూల్, నవోదయ, ఆర్ఎంఎస్, ఆర్ఐఎంసీ పేరుతో చేస్తున్న మోసం అనిర్వచనీయమని తెలిసింది. ఆ కోచింగ్ ఇవ్వడానికి కూడా ఎలాంటి అర్హత లేకున్నా.. రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండడం ఒక ఎత్తు అయితే, హాస్టల్ పేరుతో మరో రకం మోసం చేస్తున్నారని తెలిసింది. హాస్టల్ గదిలోనూ సంఖ్యకు మించి విద్యార్థులను ఉంచడం, తక్కువ ర్యాంకులు వస్తే ఎక్కువగా వచ్చినట్లుగా చూపించుకోవడం, విద్యార్థులకు కనీసం మౌలిక వసతులు కూడా కల్పించకుండా ఇరుకైన తరగతి గదులు, హాస్టల్ గదుల్లోనూ సంఖ్యకు మించి విద్యార్థులను ఉంచడంపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదేకాదు నేటికి కూడా మొదటి అడుగులోనే.. లేని సైనిక్‌ను ఉన్నట్లుగా రఘు సైనిక్ స్కూల్ పేరుతో సోషల్ మీడియా అంతటా ప్రచారం చేసుకుంటూ మోసం చేస్తున్నారని, ఇదే విషయంపై పలువురు విద్యార్థి సంఘం నాయకులు పలుమార్లు విద్యాధికారులకు ఫిర్యాదు చేయడం, వారు సైతం చర్యలు తీసుకున్నామంటే తీసుకున్నాం.. అన్నట్టుగా రెండుసార్లు నోటీసులు జారీ చేయడం జరిగిందని, రాజకీయ పలుకుబడి కారణంగా చర్యలు తీసుకోవడంలో మరో అడుగు ముందుకు వేయలేకపోతున్నామని, ఓ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కూడా వారికి అండగా ఉందని చెబుతుండడం గమనార్హం. ఈ పాఠశాలకు సంబంధించిన మరింత సమాచారాన్ని చేస్తున్న మోసాన్ని మరికొన్ని కథనాల్లో వివరించే ప్రయత్నం చేస్తాం.

## విత్తన గుళికలతో తక్కువ వర్షపాతంలోనూ మెరుగైన పంటలు

**టి. విజయ్ కుమార్ (రిటైర్డ్ ఐఏఎస్)**

సత్యసాయి జిల్లా, జూన్ 25 అనంత సూర్య: వాతావరణ మార్పులు, ఆలస్యంగా కురిసే వర్షాలు, తక్కువ వర్షపాత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానం, విత్తన గుళికల వినియోగం అత్యంత ప్రభావవంతమని రైతు సాధికార సంస్థ గౌరవ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ (రిటైర్డ్ ఐఏఎస్) అన్నారు. గురువారం ఆయన రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నికల్ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మనాయక్తో కలిసి బత్తలపల్లి, నల్లమాడ, ఓడీసీ, అమడగూరు మండలాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో



మాట్లాడారు. బత్తలపల్లి ఘంటాపురంలో బి. పార్వతి, నల్లమడలో నాగరాజు నాయక్, రమేష్ నాయక్, వినోద్ నాయక్, సాయి కుమార్ నాయక్, ఆనంద్ నాయక్, ఓడీసీలో వాసుదేవరెడ్డి, ఆనందరెడ్డి, అమడగూరులో లక్ష్మీనారాయణరెడ్డి, సరస్వతి సాగుచేస్తున్న పీఎండీఎస్, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. విత్తన గుళికల వల్ల మొలక శాతం పెరగడం, తేమ నిల్వ మెరుగుపడటం, పంటలు బలంగా ఎదగడం, సాగు ఖర్చులు తగ్గి లాభదాయకత పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. రైతులు సమూహాలుగా ఏర్పడి కాంపాక్ట్ బ్లాక్ విధానంలో పీఎండీఎస్, ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నారాయణ నాయక్, ప్రోగ్రామ్ మేనేజర్ నరేంద్ర కుమార్, డాక్టర్ నవీన్, దామోదరరెడ్డి, సనవుల్లా, లక్ష్మీనాయక్, ఇతర అధికారులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు మోటరైజ్డ్ వీల్ చైర్ల పంపిణీ

### 48 'నియో బోల్ట్' బ్యాటరీ వీల్ చైర్లను అందజేసిన జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి, జూన్ 25 అనంత సూర్య: టింబక్టు కలెక్టివ్ సహకారంతో, హ్యుందాయ్ మోబిస్ ఆర్థిక సహాయంతో నియోమోషన్ సంస్థ రూపొందించిన 48 'నియో బోల్ట్' బ్యాటరీ వీల్ చైర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ గురువారం స్థానిక రెవెన్యూ భవనంలో దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ వీల్ చైర్‌గా ఉపయోగించడంతో పాటు అవసరమైనప్పుడు స్కూటీగా మార్చుకునే వీలున్న ఈ ఆధునిక పరికరాలు దివ్యాంగుల స్వావలంబనకు, సులభ రవాణాకు ఎంతో దోహదపడతాయని అన్నారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన హ్యుందాయ్ మోబిస్, టింబక్టు కలెక్టివ్, నియోమోషన్ సంస్థలను ఆయన అభినందించారు. ఈ ఎంపిక శిబిరానికి జిల్లా నలుమూలల నుంచి సుమారు 100 మంది దివ్యాంగులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, నియోమోషన్ సహ వ్యవస్థాపకుడు సిద్ధార్థ్, హ్యుందాయ్ మోబిస్ ప్రతినిధి సింధుజ, టింబక్టు కలెక్టివ్ ప్రోగ్రామ్ మేనేజర్లు శ్రీకాంత్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు...






## నార్పలలో టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక ఆపరేషన్

### రూ.2 కోట్ల విలువైన 109 ఎర్రచందనం దుంగలు స్వాధీనం, ముగ్గురు అరెస్ట్

అనంతపురం, జూన్ 25 అనంత సూర్య: అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామ శివార్లలో టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందం నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.2 కోట్ల విలువైన 109 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, ఒక కారును సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, బొందలవాడ గ్రామ శివార్లలో అక్రమ రవాణా కోసం భారీ మొత్తంలో ఎర్రచందనం దుంగలను డంప్ చేసినట్లు గుర్తించారు. ఈ దుంగలను ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేయడానికి ముఠా యత్నిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టు చేసిన నిందితుల్లో ఇద్దరు బొందలవాడ గ్రామానికి చెందినవారు కాగా, మరొకరు రేగడకొత్తూరు గ్రామానికి చెందిన వ్యక్తి అని అధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఈ ఎర్రచందనం నిల్వలను గుర్తించిన



టాస్క్‌ఫోర్స్ బృందం, తదుపరి దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుంది. కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## రాష్ట్ర స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి



అనంతపురం, జూన్ 25 అనంత సూర్య : ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో తిరుపతిలో ఈ నెల 29వ తేదీన జరగబోయే రాష్ట్ర స్థాయి సమావేశాని అన్ని విద్యార్థి సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ, జేఏసీ రాష్ట్ర కమిటీని అన్ని జిల్లాల అధ్యక్షులు వారు ఎన్నుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని విద్యాసంస్థలు అనవసరంగా విద్యార్థి సంఘాల నేతల పైన కేసులు పెట్టించారని వాటి పైన కూడా అన్ని విద్యార్థి సంఘాలు కలుపుకొని న్యాయ పోరాటం చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు, కుల సంఘాలకు, ఏవిధమైన ప్రాంతీయ సంఘాలకు సంబంధం లేకుండా విద్యార్థి జేఏసీ కమిటీ ఈ సమావేశం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కావున అన్ని సంఘాల నుంచి ఒక్కొక్కరిని కలుపుకొని జేఏసీ చైర్మన్ కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## రండి.. పోలియో వ్యాధిని తరిమికొడదాం - డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి



అనంతపురం, జూన్ 25 అనంత సూర్య : పోలియో నిర్మూలనకు కొన్ని అడుగుల దూరంలో ఉన్నామని, ఈనెల 28న జరుగునున్న పోలియో టీకాల కార్యక్రమం విజయవంతానికి కలిసి రావాలని అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఈబి.దేవి పిలుపుఇచ్చారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా నగరంలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లలకు నూటికి నూరు శాతం మందికి పోలియో చుక్కలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, పురపాలక శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. ఈనెల 28న పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. 0-5 సంవత్సరాల మధ్య వయసున్న 2,83,430 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు 5,247 మంది సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాలను కలుపుకుని మొత్తం 1,623 పోలింగ్ బూతులలో పోలియో చుక్కలు వేస్తారన్నారు. జన రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో పోలియో చుక్కలు వేసేందుకు 58 ప్రత్యేక బృందాలు, 68 మొబైల్ టీంలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. తొలిరోజు మిగిలిపోయిన చిన్నారులను గుర్తించేందుకు 29, 30వ తేదీల్లో గృహ సందర్శన కార్యక్రమాన్ని చేపట్టి, ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సిడిపిఓలు మరియు స్వచ్ఛంధ సంస్థలను సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులను ఆదేశించామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అవుతుందని, ఐదేళ్లలోపు పిల్లలందరినీ పోలియో బూత్లకు తరలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లాలోని వైద్యాధికారులందరికీ గురువారం జూమ్ మీటింగ్ ద్వారా శిక్షణతో పాటు సూచనలు, సలహాలు అందివ్వనున్నట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకాలు అధికారి ప్రసన్న భారతి, ప్రోగ్రాం అధికారి విష్ణుమూర్తి, మలేరియా అధికారి ఓబులు, డెమో అధికారి నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405